క్లుప్తంగా

అలరించిన భక్తిగీతాలపన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం భక్తిగీతాలపన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గాయనీ యిమ్మడి అంజనీదేవి బృందం కీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. తబలపై బాలాజీ, కీబోర్డుపై అశోక్‌కుమార్ వాయిద్యాన్ని అందించారు.

దర్గాలో ఇఫ్తార్ విందు



లక్ష్మీపురం: మహబూబ్ సుభాని 21వ మనవలు హజరత్ సయ్యద్ షా మొహిద్దీన్ బాషా ఖాదిరి బాబా దర్గాలో చంద్రమాన 21వ రోజు సందర్భంగా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి సులేమాన్ ఖాదిరి మాట్లాడుతూ గుంటూరు జిల్లా చుట్టుపక్కల నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో కుల మతాలకతీతంగా బాబా ఆశీస్సులు మెండుగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా సోదర భావంతో ఉండాలన్నారు. రంజాన్ శుభమాసంలో దర్గా ప్రాంగణంలో భక్తుల సమక్షంలో ఇఫ్తార్ విందుకు పాల్గొనడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్థానికులు దర్గా మూరీధులు తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కొల్లిపర మండలం అత్తోటలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నేల ఆరోగ్యం, పరిరక్షణ, భూసార పరీక్షల ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్ వెంకటలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు, పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు వై.భారతి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ 2047 పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు రూరల్: స్వర్ణాంధ్ర విజన్ 2047 విజయవంతానికి విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ప్రణాళికా శాఖా కార్యాలయ అధికారులు ఎస్ఓ కె.పోలయ్య, ఏఎస్ఓలు ఎస్ఎస్ శర్మ, ధర్మారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు కృషి చేయాలి



చేబ్రోలు: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయి కుమార్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని ఎస్‌డబ్ల్యూ షెడ్‌లో చేబ్రోలు, వట్టిచెరుకూరు, పొన్నూరు మండలాలలకు చెందిన పంచాయతీ సిబ్బంది, క్లాప్ మిత్రలు, గ్రీన్‌గార్డులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాగ సాయికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లు, దుకాణాలు, కంపెనీలు నుంచి బిన్ – బ్యాగ్ విధానంలో ఘన వ్యర్థాలను చెత్త సేకరించాలని చెప్పారు. చెత్త సేకరణ చేయడం వలన చెత్త నుంచి సంపద తయారీ లక్ష్యాలైన వానపాముల ఎరువు మరియు ఇతర ప్లాస్టిక్ ఘన వ్యర్థాలను రీ సైకిల్ చేయటానికి వీలుగా ఉంటుందని వివరించారు. చెత్త సంపద కేంద్రాల వద్ద పచ్చని మొక్కలు కూరగాయలు, ఆకుకూరలు తడిచెత్త నుంచి తయారు చేసిన వానపాముల ఎరువుతో పెంచి షెడ్డు నిర్వహణ సమర్థవంతంగా ఉండేందుకు పంచాయతీ సిబ్బంది క్లాప్ మిత్రలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ కే అనూరాధ, ఎంపీడీఓ కె లలిత, ఈఓపీఆర్డీ టి.ఉషారాణి పాల్గొన్నారు.

టీబీ అలర్ట్...

- రేపు ప్రపంచ క్షయ నివారణ దినం
- 2025 నాటికి టీబీ అంతం లక్ష్యం
- గుంటూరు జిల్లాలో 5,325 మంది రోగులు

గుంటూరు మెడికల్: భారతదేశంలో సంభవిస్తున్న మరణాల్లో క్షయవ్యాధి(టీబీ) మరణాలు ఎక్కువగా ఉన్నాయి. దేశంలో ప్రతి రోజూ ఐదు వేల మంది వ్యాధి బారిన పడుతున్నారు. ప్రతి 10 నిమిషాలకు ఇద్దరు చనిపోతున్నారు. వ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియా ట్యూ బర్క్యులోసిస్‌ను 1862 మార్చి 24న బెర్లిన్‌కు చెందిన డాక్టర్ రాబర్ట్‌కోచ్ కనుకొన్నాడు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఏటా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

లక్షణాలు....

రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, దగ్గినప్పుడు రక్తం పడటం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గిపోవటం, ఆకలి మందగించటం, రాత్రి వేళల్లో జ్వరం రావటం, చమటలు పట్టడం. ధూమపానం, మద్యపానం లాంటి చెడు వ్యసనాలు ఉన్నవారికి, హెచ్ఐవీ బాధితులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వ్యాధి సోకినవారు దగ్గినా, తుమ్మినా వారి నోటి తుంపరలు మీద పడటం ద్వారా వ్యాధి సోకుతుంది

ఉచిత పరీక్షలు...

జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో టీబీ జబ్బు సోకిందా లేదా అని నిర్ధారించే కళ్లె పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. గుంటూరు జీజీహెచ్ ఆవరణలోని జిల్లా క్షయ నివారణ కేంద్రం, గోరంట్లలోని ప్రభుత్వ జ్వరాల ఆస్పత్రి, గుంటూరులోని ఇజ్రాయిల్‌పేట పట్టణ ఆరోగ్య కేంద్రం, పొన్నూరు, తెనాలి, మంగళగిరి, నుదురుపాడు, చేబ్రోలు, పెదపలకలూరు, తుళ్లూరు, పొన్నెకల్లు, సంగంజాగర్లమూడి, మంగళగిరి ఎన్నారై మెడికల్ కాలేజీ, నూతక్కి, తాడేపల్లి, మోరంపూడి, పెదనందిపాడు, కాటూరి మెడికల్ కాలేజ్, పెదకాకానిలలో కళ్లె పరీక్ష కేంద్రాలు ఉన్నాయి.

టీబీ వ్యాధి నిర్ధారణ

కళ్లె పరీక్ష, ఎక్సరే, ఆర్టీపీసీఆర్, సీబీన్యాట్, వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా టీబీ వ్యాధిని నిర్ధారించి వ్యాధి ఉన్నవారికి మందులను కూడా ఉచితంగా అందజేస్తారు. మందులు ఆరు నెలల నుండి ఎనిమిది నెలలపాటు క్రమం తప్పకుండా వాడాలి.



మధ్యలో మందులు మింగటం ఆపివేస్తే వ్యాధి ముదిరిపోయి ప్రాణాంతకం అవుతుంది. సుమారు 6వేల నుంచి 25 లక్షల ఖరీదు చేసే చికిత్సను ప్రభుత్వం టీబీ వ్యాధి బాధితులకు అందజేస్తుంది. ప్రభుత్వం త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకునేందుకు 3,500 మందికి పౌష్టికాహారాన్ని అందజేస్తుంది. అంతేకాకుండా ప్రతినెలా రూ.500 చొప్పున క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పారితోషికం అందజేస్తుంది.

జిల్లాలో బాధితుల వివరాలు

గుంటూరు జిల్లాలో 2024లో 64,697 మంది టీబీ అనుమానిత బాధితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా 5,325 మందికి టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయింది. 2025లో జనవరి నుంచి నేటి వరకు 14,790 మందికి టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా 1176 మందికి టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయింది.

సీబీ న్యాట్‌తో త్వరితగతిన వ్యాధి నిర్ధారణ



హెచ్ఐవి ఉన్నవారిలో 80 శాతం మందికి క్షయ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ. పొగతాగేవారికి, టీబీ రోగులకు వైద్యం అందించే వారికి, షుగర్ వ్యాధి ఉన్నవారికి మూడు శాతం టీబీ సోకే అవకాశాలు ఉన్నాయి. సీబీ న్యాట్ వైద్య పరికరం ద్వారా హెచ్ఐవీ బాధితులకు క్షయనిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. సీబీ న్యాట్ వైద్య పరికరం ద్వారా కేవలం రెండు గంటల్లోనే హెచ్ఐవీ ఉన్నవారికి టీబీ ఉందా లేదా నిర్ధారణ చేయవచ్చు.

–డాక్టర్ దాసరి శ్రీనివాసులు,
జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి, గుంటూరు

2025 నాటికి క్షయను అంతమొందించాలి



దేశ వ్యాప్తంగా 2025 నాటికి క్షయను భారత దేశం నుంచి అంతమొందించాలనే లక్ష్యంతో వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. వ్యాధిపై అవగాహన కోసం మార్చి 24న నగరంలో అవగాహన ర్యాలీలో ఏర్పాటు చేస్తున్నాం. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కోసం వ్యాస రచన పోటీలు నిర్వహించాం. ఐదేళ్ల నుంచి టీబీ కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి

డస్ట్ బిన్స్ ఏర్పాటు తప్పనిసరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో కమర్షియల్ సంస్థలు తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకొని, వ్యర్థాలను ఆయా సేకరణ ఏజెన్సీలు లేదా నగరపాలక సంస్థ ప్రజారోగ్య వాహనాలకు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం కమిషనర్ పట్టాభిపురం, స్తంభాల గరువు, శ్యామల నగర్, సాయి నగర్, బంజారా నాయక్ కాలనీ, ఎన్జీఓ కాలనీ, వెంకటరామణ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కమర్షియల్ సంస్థల్లో వ్యర్థాలు రోడ్లు, డ్రెయిన్లలో వేస్తున్నారని, ఇక నుంచి డస్ట్ బిన్ పెట్టుకోకుండా వ్యర్థాలను రోడ్ల మీద వేసే సంస్థలకు తొలుత భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించడం, పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టాభిపురం, కృష్ణ నగర్ ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా పరిశీలించి, కృష్ణ నగర్ మెయిన్ రోడ్‌లో డెబ్రిస్ ఉండడం, పట్టాభిపురం మెయిన్ రోడ్‌లో ఆక్రమణలు గుర్తించి, తక్షణం తొలగించాలని అధికారులను ఆదేశించారు. శ్యామల నగర్ ఎక్స్ టెన్షన్ సాయి నగర్‌లో రోడ్ వెంబడి భారీ చెట్లను నరికేసిన వారిపై పోలీస్ కేసు నమోదు చేయాలని, ప్రస్తుత వాతావరణంలో చెట్ల రక్షణ కీలకమన్నారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవరపల్లి ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



నగరంలోని ఓ వీధిని పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

వడ్డీ లేకుండా పన్ను చెల్లించడానికి 9 రోజులే గడువు

2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను, బకాయిలను చెల్లించటానికి ఈ నెలాఖరు వరకే (9 రోజులే) గడువు ఉందని పన్ను చెల్లింపుదార్లకు వీలుగా ఆదివారం, ఈ నెల 30, 31 సెలవు రోజులైనప్పటికీ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నుపై వడ్డీ రాయితీ లేనందున బకాయిదార్లు ఈ నెలాఖరు లోపు పన్ను బకాయిలు చెల్లించాలన్నారు.

యూత్ పార్లమెంట్ రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన వికసిత భారత్ యూత్ పార్లమెంట్ జిల్లా స్థాయి పోటీలు శనివారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి పాల్గొన్న 150 మంది విద్యార్థుల్లో నుంచి 10 మందిని ఈనెల 28న ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు పట్టాభి చైతన్య, ఇందుమతి సాయి ఫణి కిరణ్ (బాపట్ల), ఎం.రామారావు, మల్లెల సాయి (ఎన్టీఆర్), ఎం.మేఘన, ఏ స్వరాజ్య లక్ష్మి (గుంటూరు), ఓ. మరియబాబు, బి.రామ లక్ష్మీ ప్రియ (పల్నాడు), ఎం.హరి ప్రియ, ఎం.గాయత్రి (కృష్ణా)ని నెహ్రూ యువ కేంద్ర యూత్ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జయశైలజ, యూత్ పార్లమెంట్ కమిటీ సభ్యుడు సీహెచ్ రాంబాబు, డాక్టర్ నాగ నిర్మల, డాక్టర్ కేబీహెచ్ శాస్త్రి, జ్యోతి, మేజర్ పి.కుమార్ రాజా, బి.శ్రీనివాసరావు అభినందించారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో అనితాదేవి, కిరణ్మయి దేవిరెడ్డి

మీకు నచ్చితేనే చేయండి

- నటుడు ప్రదీప్ మాచిరాజు
- క్రియేటివిటీకు టెక్నాలజీను జోడించాలి
- విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- నిరులలో వైభవంగా ముగిసిన జాతీయ స్థాయి నిరులోత్సవ్–2కే25

గుంటూరు రూరల్: విద్యార్థులు ఏదైనా పనిని ప్రారంభించే ముందు మీకు నచ్చితేనే చేయండని యాంకర్, యాక్టర్, విజ్ఞాన్ పూర్వ విద్యార్థి ప్రదీప్ మాచిరాజు అన్నారు. పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయస్థాయి టెక్ ఒడిస్సీ, కల్చరల్ కాస్కేడ్, క్రియేటివ్ కాన్వాస్, వర్డ్ సింఫనీ, బిజినెస్ పరేడ్, చిల్ థ్రిల్, స్పోర్ట్స్ ఫెస్ట్ నిరులోత్సవ్–2కే25 శనివారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఏం సాధించాలన్నా ధైర్యం, ఆత్మస్థైర్యం ఉండాలన్నారు. వచ్చేనెల ఏప్రిల్ 11న తను నటించిన అక్కడ అమ్మాయి– ఇక్కడ అబ్బాయి సినిమా విడుదల అవుతుందని, సినిమాను అందరూ ఆదరించి అఖండ విజయం అందించాలని విద్యార్థులను కోరారు. కాడ్వెన్ ఇన్వెకాస్ డైరెక్టర్ నల్లపనేని మాధురి మాట్లాడుతూ సాంకేతికత నిరంతరం మారిపోతుందని తెలిపారు. విజ్ఞాన్ విద్యాసంస్థ చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ వినూత్న ఆలోచనలకు కాసింత క్రియేటివిటీ, టెక్నాలజీను జోడించి ఉపయోగించుకుంటే జీవితంలో విద్యార్థులు ముందుకు దూసుకెళ్లి పోవచ్చని చెప్పారు. ఇలాంటి ఉత్సవాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఒకరితో మరొకరు ఎలా మెలగాలి? బృంద సమూహంగా ఎలా పని చేయాలినే విషయాలు తెలుస్తాయన్నారు.



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ప్రదీప్, విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య

నిరులోత్సవ్– 2కే25 విజేతలకు బహుమతులు

జాతీయ స్థాయి విజ్ఞాన్ నిరులోత్సవ్‌లో భాగంగా మొత్తం 45 ఈవెంట్లను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు విలువైన నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను, సర్టిఫికెట్లను అందించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సినిమా హీరోయిన్ దీపిక పిల్లి, ఎస్‌బీఐ మేనేజర్ కే ప్రియాంక, నిరుల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ హెచ్ఎల్ఆర్ ప్రాంగణం నుంచి ఏ.టి అగ్రహారం రిజర్వాయర్‌నకు తాగు నీరు సరఫరా చేసే ప్రధాన పంపింగ్ మెయిన్ లైన్‌పై వాల్వ్ మార్చుతున్న నేపథ్యంలో పలు రిజర్వాయర్లకు, గృహాలకు సోమవారం తాగు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్ పరిధిలోని గృహాలకు, ఏటీ అగ్రహారం రిజర్వాయర్, హౌసింగ్ బోర్డు రిజర్వాయర్, గుజ్జనగుండ్ల రిజర్వాయర్, స్తంభాలగరువు రిజర్వాయర్, వికాస్‌నగర్ రిజర్వాయర్లకు, స్వర్ణభారతినగర్ ప్రాంతంలోని గృహాల వారికి తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. మంగళవారం ఉదయం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా ఉంటుందని చెప్పారు.

వర్గీకరణ సాధనలో కృష్ణమాదిగ కృషి ఎనలేనిది

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ సాధించుటలో మందకృష్ణ మాదిగ కృషి ఎనలేనిదని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి పుసులూరి జీవా పేర్కొన్నారు. శనివారం గుంటూరు విచ్చేసిన మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మూడు దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదిగ లాయర్స్ ఫెడరేషన్ నాయకులు వీర్రాజు, గోపి, రాజా, కుమార్, మోజేష్, నాని, విజయ్‌వర్మ, విజయ్ పాల్గొన్నారు.

నేడు కుట్టు మిషన్ల పంపిణీ

గుంటూరు మెడికల్: గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కోబాల్ట్ పేట 3వ లైన్‌లో కుట్టు మిషన్లు శిక్షణ పొందిన 25 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు పఠాన్ అల్లాభక్షు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొంటారన్నారు. గత నాలుగు నెలలుగా కోవిడ్ ఫైటర్స్ ఆధ్వర్యంలో 25 మంది మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నామన్నారు.

అమరావతిలో శాలివాహన చక్రవర్తి విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రత్తిపాడు: అమరావతిలో శాలివాహన చక్రవర్తి, కవయిత్రి మొల్ల విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ అన్నారు. శాలివాహన సంఘం గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో శనివారం శాలివాహన చక్రవర్తి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు జిల్లా యూత్ ప్రెసిడెంట్ మామిళ్లపల్లి సుబ్బారావు మాట్లాడారు.

ఉగాది పాటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈనెల 15న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో నిర్వహించిన ఉగాది పురస్కారాలు–2025 పాటల పోటీల్లో ప్రతిభ చూపిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ హైస్కూల్ ఆరో తరగతి విద్యార్థి ఎం.లలిత్ సాయి, నాలుగో తరగతి విద్యార్థిని నేహా సాయి ప్రశంసా పత్రం అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. శనివారం లక్ష్మీపురంలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, అనేక పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతిదేవి, సమన్వయకర్తలు దోసకాయల దుర్గా శ్యామ్, తిరుపీధుల శ్రీదేవి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్

అక్టోబర్ 2 నాటికి క్లీన్ గుంటూరు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర నినాదం స్ఫూర్తితో అక్టోబర్ 2 నాటికి క్లీన్ గ్రీన్ గుంటూరు సాధనకు ప్రజల సహకారం, భాగస్వామ్యంతో కృషి చేస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో రూఫ్ గార్డెనింగ్, హోం కంపోస్ట్ తయారీపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ ఆధారిత నినాదాలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో గుంటూరు నగరంలో అక్టోబర్ 2 నాటికి పచ్చదనం పెంపే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా హోం కంపోస్ట్ తయారీ తద్వారా కిచెన్, రూఫ్ గార్డెన్లను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 15 తేదీలోగా ప్రత్యేకమైన యాప్ ద్వారా నగరంలో హోం కంపోస్ట్, కిచెన్ గార్డెన్లను ఎంత మంది చేపడుతున్నారు, నూతనంగా చేపట్టడానికి ఎంతమంది ఆసక్తి చూపుతున్నారు అనే రిపోర్ట్ సేకరించనున్నట్లు చెప్పారు. సదరు రిపోర్ట్ ఆధారంగా వీరందరికీ కంపోస్ట్ ఎరువు, అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యాన శాఖ డీడీ రవీంద్రబాబు మాట్లాడుతూ, రసాయనాలు, పురుగు మందులు వినియోగించకుండా పండించే పంటలకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టే కిచెన్, రూఫ్ గార్డెన్ ల ఏర్పాటుకు ఉద్యాన శాఖ నుండి తగిన సహకారం అందిస్తామన్నారు. తొలుత ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి సద్వినియోగంపై ఐటీసీ రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం గార్డెనింగ్, కంపోస్ట్ తయారీపై పలువురు నిపుణులు, నిర్వాహకులు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏడీహెచ్ శ్రీనివాసరావు, ఉపా సెల్ పీఓ రామారావు, గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఎకాలజీ ప్రొటెక్షన్ సర్వీసెస్ ఫౌండర్ చెలికాని సీతారామయ్య, ప్రభుత్వ మహిళా కాలేజీ బోటనీ విభాగం హెచ్ఓడీ సంతోషి కుమారి, గ్రీన్ కార్పొరేషన్ కన్సల్టెంట్ శివప్రసాద్, మిద్దె తోటల గ్రూప్ అడ్మిన్ కష్ణకుమారి, గ్రీన్ కోర్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

నెహ్రూ నగర్: ఇటీవల మృతి చెందిన ఇంజినీరింగ్ విభాగ ఔట్ సోర్సింగ్ కార్మికుడు సిహెచ్.రోశయ్య కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా, మట్టి ఖర్చుల చెక్‌ను వారి కుటుంబ సభ్యులకు శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ పులి శ్రీనివాసులు అందించారు. ఎక్స్ గ్రేషియా క్రింద రూ.2 లక్షలు, మట్టి ఖర్చులు రూ.15 వేల చెక్‌ను వారి కుటుంబ సభ్యులకు అందించారు.

నేత్ర, అవయవదానంపై విస్తృతస్థాయి ప్రచారం అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: వర్తమాన సమాజంలో రక్తదానంపై ప్రజల్లో అవగాహన ఉన్నప్పటికీ నేత్ర, అవయవ, దేహదానం పై ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం కల్పించాలని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ తాత సేవ కుమార్ పేర్కొన్నారు. ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో నేత్ర, అవయవ, దేహదానం ఆవశ్యకతపై వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సేవ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ అంశంపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉన్నారన్నారు. మనదేశంలో ఉన్న నమ్మకాలతో ప్రజల ఆలోచన విధానాల్లో వెనుకబాటుతనం ఉందన్నారు. సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు బి.కైలాస్‌నాథ్ మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం ద్వారా పదిమందికి చూపు తెప్పించవచ్చని, బ్రెయిన్ డెడ్ ద్వారా గుండె, లివరు, కిడ్నీలు వంటి అన్ని ప్రధాన అవయవాలు అవసరమైన వ్యక్తులకు వైద్యులు అమరుస్తారని తద్వారా ఆ వ్యక్తి తిరిగి బ్రతికున్న వారి రూపేణా పునర్జన్మను పొందవచ్చన్నారు. స్వచ్ఛంద సేవకుడు వల్లూరి సదాశివరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల శంకర నేత్రాలయానికి తన భార్య జానకి మరణానంతరం నేత్రాలను దానం చేసిన చింతలపాటి శంకర శాస్త్రిని సత్కరించారు. ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కందిమళ్ల శివప్రసాద్, టీవీ కృష్ణమూర్తి, సాగర్, సెర్ప్ సంస్థ హనుమ ప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మండవ శ్యాం సుందర్, డాక్టర్ టీవీ రత్నరావు, డాక్టర్ పోతురాజు శ్రీనివాసరావు, సిహెచ్ సావిత్రి, మురళీకృష్ణ, రాధాకృష్ణ, రమణ్ బాబు పాల్గొన్నారు.



శంకర శాస్త్రిని సత్కరిస్తున్న డాక్టర్ సేవకుమార్, రాజేంద్రప్రసాద్, సదాశివరావు

కేంద్ర హోం మంత్రిపై చర్యలు తీసుకోవాలని వినతి

లక్ష్మీపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజకు ఈ మేరకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జి పాలక్ వర్మ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ కొన్ని నెలలు క్రితం రాజ్యసభలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను కేంద్రమంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలకు ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలక విజయ్ కుమార్, మాజీ శాసనసభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆఫీస్ ఇన్‌చార్జి బిళ్ళా సునీల్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం పాలు విజయకుమార్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- కిట్స్‌లో కోలాహలంగా ప్రారంభమైన యువ 2025 వేడుకలు

ప్రత్తిపాడు: విద్యార్థుల్లో ఉన్నత వ్యక్తిత్వం, విలువలతో కూడిన నాయకత్వ లక్షణాలుండాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(కిట్స్ కళాశాల)లో శనివారం కిట్స్ యువ–2025 కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమయింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పెమ్మసాని క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్, విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యసంరక్షణ, విద్యతో పాటు సామాజిక సేవలను అందించడంలో విద్యార్థులు తమ వంతు సహకరించాలన్నారు. వ్యవసాయ రంగంలో మెరుగైన పద్ధతులు, రుణలభ్యత, మార్కెట్ అనుసంధానాలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. వ్యక్తిగతంగా సాధించుకున్న ఖ్యాతి మనకు విలువనిస్తుందని చెప్పారు. ఉన్నత స్థానం కష్టపడటం ద్వారానే సాధ్యమవుతుందని వివరించారు. ఇన్ఫోసిస్ డెలివరీ హెడ్ నర్రా సురేష్ మాట్లాడుతూ మార్కులు అనేవి నంబర్ మాత్రమేనని, మార్కులు వలన మాత్రమే ఉద్యోగాలు రావని, విలువలతో కూడిన వ్యక్తిత్వం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడారు. ప్రిన్సిపాల్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతి వెలిగించి యువ- 2025ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని